సాక్షి
జగిత్యాల
బుధవారం ׀ 24 ׀ సెప్టెంబర్ ׀ 2025



అంజన్న సన్నిధిలో భక్తుల రద్దీ

మల్యాల: కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. దర్శనం టికెట్ల విక్రయాలు, లడ్డూ, ప్రసాదం ద్వారా ఆలయానికి రూ.2.75 లక్షల ఆదా యం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



ఐరావతంపై నృసింహుడు

ధర్మపురి: దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీలక్ష్మీనృసింహస్వామి ఉత్సవ మూర్తులను ఐరావతంపై ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

గరిష్టం/కనిష్టం
30.0/22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు కొనసాగుతాయి.

రిజర్వేషన్లపై ఫోకస్..!

'స్థానికం'పై కసరత్తు

- కలెక్టరేట్‌లో రెండురోజులుగా ప్రక్రియ
- రిజర్వేషన్ల ఖరారుపై మార్గదర్శకాలు విడుదల
- బీసీ రిజర్వేషన్లపైనే సర్వత్రా ఆసక్తి



జగిత్యాల: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రిజర్వేషన్లు ఖరారు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ కావడంతో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. సెప్టెంబర్ 30లోపు స్థానిక ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు తీర్పునివ్వగా.. దానికి అనుగుణంగా ప్రభుత్వం కూడా సన్నద్ధమవుతోంది. రిజర్వేషన్ల ఖరారుపై మార్గదర్శకాలు విడుదల కావడంతో కలెక్టర్ సత్యప్రసాద్ దాని ప్రకారం ముందుకెళ్తున్నారు. జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్, వార్డు సభ్యులకు సంబంధించిన రిజర్వేషన్ ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేసినట్లు తెలుస్తోంది. రెండు రోజులుగా ఎంపీడీవోలు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు కలెక్టరేట్‌లో రిజర్వేషన్లపై కసరత్తు చేశారు. కలెక్టర్ పూర్తిస్థాయిలో వాటిని పరిశీలించి ఖరారు చేసినట్లు తెలిసింది. రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్ల కోటా కేటాయించనుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉత్కంఠ నెలకొంది. బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్ అమలు చేయనుండటంతో దీనిపైనే జిల్లాలో చర్చ కొనసాగుతోంది. బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఎలా ఇస్తారు..? అనే చర్చే ప్రతినోటా వినిపిస్తోంది. ఉన్నతాధికారుల నుంచి రిజర్వేషన్ స్థానాలు కేటాయించాలని ఆదేశాలు రావడంతో కలెక్టర్ లు శాఖల అధికారులతో సమావేశమయ్యారు. సామాజిక, ఆర్థిక, కులగణనలో ఉన్న బీసీ జనాభా వివరాలు, ఎస్సీ, ఎస్టీ జనాభా వివరాలు లెక్కల ఆధారంగా రిజర్వేషన్లు చేపట్టనున్నట్లు తెలిసింది. గత ఎన్నికల్లో ఉన్న రిజర్వేషన్ కేటగిరీలు ఈసారి ఉండవు. మళ్లీ నూతన రిజర్వేషన్లు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు.

రిజర్వేషన్ల ఖరారు కలెక్టర్లకే..

జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచుల రిజర్వేషన్ల ఖరా రు చేసే బాధ్యత కలెక్టర్లకే ఇచ్చినట్లు తెలిసింది. సర్పంచ్ పదవుల్లో రిజర్వేషన్ స్థానిక ఆర్డీవో, వార్డు స భ్యుల రిజర్వేషన్లు మండల ఎంపీడీవోలు చూ స్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సీట్లు కేటాయించిన తర్వాతే మిగితా సీట్లు జనరల్‌కు కేటాయిస్తున్నట్లు తెలిసింది.

ఆశావహుల్లో దడ

రిజర్వేషన్ల ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయం వేడెక్కింది. గతంలో ఉన్న రిజర్వేషన్ ఉండదని తెలుస్తుండటంతో ఆశావహుల్లో దడపుడుతోంది. ఇప్పటికే జెడ్పీటీసీలు, ఎంపీటీసీలతోపాటు, మున్సిపల్ పాలకవర్గం సమయం ముగిసి రెండేళ్లు సమీపిస్తోంది. ఎన్నికలు ఎప్పుడెప్పుడా నిర్వహిస్తారా..? అని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు రిజర్వేషన్లపై అధికారులు కసరత్తు చేస్తుండటంతో వారిలో సందడి మొదలైంది. జిల్లాలో 6,07,222 మంది ఓటర్లు ఉన్నారు. 385 గ్రామాల్లో 3,536 వార్డులున్నాయి. 20 జెడ్పీటీసీలు, 216 ఎంపీటీసీ స్థానాలున్నాయి. గతంలో 18 జెడ్పీటీసీలకే ఎన్నికలు జరగగా.. ఈసారి కొత్తగా భీమారం, ఎండపల్లి స్థానాలు పెరిగాయి. అలాగే ఎంపీటీసీ స్థానాలు కూడా రెండు పెరిగాయి. ఇవి కాక ఐదు మున్సిపాలిటీల్లోనూ ఎన్నికలు నిర్వహించనున్నారు.

మొత్తం ఓటర్లు	6,07,222
పురుషులు	2,89,249
మహిళలు	3,17,964
ఇతరులు	9
పంచాయతీలు	385
వార్డులు	3,536
జెడ్పీటీసీ స్థానాలు	20
ఎంపీటీసీ స్థానాలు	216

షుగర్ ఫ్యాక్టరీపై చిగురిస్తున్న ఆశలు

- 26న కర్మాగారాన్ని సందర్శించనున్న పరిశ్రమలు, వ్యవసాయశాఖ అధికారుల బృందం
- పునఃప్రారంభం కోసం రైతుల అభిప్రాయాల సేకరణ



ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీ

మల్లాపూర్: మండలంలోని ముత్యంపేటలోగల నిజాం దక్కన్ షుగర్స్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ దిశగా అడుగులు పడుతున్నాయి. మూతపడిన కర్మాగారాన్ని ఈనెల 26న పరిశ్రమలు, వ్యవసాయశాఖల ఉన్నతాధికారుల బృందం సందర్శించనుంది. బృందం సభ్యులు రైతులతో సమావేశమై అభిప్రాయాలు సేకరించనున్నారు. ఈ మేరకు మంగళవారం పరిశ్రమలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్, వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, షుగర్‌కేన్ డైరెక్టర్ సీహెచ్.నర్సిరెడ్డి కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి అభిప్రాయ సేకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

మూతపడి పదేళ్లు..

నష్టాలతో నడుస్తున్న షుగర్ ఫ్యాక్టరీకి స్వరాష్ట్రం వచ్చాక ఎన్‌డీఎస్‌ఎల్ యజమాన్యం లే ఆఫ్ ప్రకటించింది. దీంతో ఫ్యాక్టరీ 2015 డిసెంబర్ 23న మూసివేశారు. అప్పటికే నష్టాలతో నడుస్తున్న ఫ్యాక్టరీని రైతుల భాగస్వామ్యంతో పునరుద్ధరిస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించినా.. కొన్ని కారణాలతో ముందడుగు పడలేదు. దీంతో ఈ ప్రాంత రైతులు పదేళ్లుగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తూ వస్తున్నారు. ఫ్యాక్టరీల పునరుద్ధరణ.. చెరుకు పంట విస్తీర్ణాన్ని పెంచడం.. టన్ను చెరుకుకు రూ.4వేల మద్దతుధర కల్పిస్తామని ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇందులో భాగంగానే గతేడాది ఫిబ్రవరిలో పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో పునరుద్ధరణ కమిటీ బృందాన్ని నియమించింది. ఆ బృందం ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని సందర్శించి రైతుల అభిప్రాయాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందించింది.

26న ఏర్పాట్లు చేయండి..

జగిత్యాలఅగ్రికల్చర్: ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని చెరుకు రైతులతో ఈనెల 26న వ్యవసా య, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు సమావేశం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, ఎస్పీకి ఆదేశాలు అందాయి. ఈ మేరకు స్పెషల్ చీ ఫ్ సెక్రటరిలు సంజయ్‌కుమార్, రఘునందన్‌రావు కలెక్టర్, ఎస్పీతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రైతులు సమన్వయంతోఉండేలా చర్యలు తీసుకోవాలని సూ చించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ యాదగిరి, వ్యవసాయాధికారి భాస్కర్, మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్పీ రాములు, అసిస్టెంట్‌చెరుకుకమిషనర్‌వెంకటరవిపాల్గొన్నారు.

తెరుచుకునేనా..?

షుగర్ ఫ్యాక్టరీని పరిశ్రమలు, వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల బృందం సందర్శిస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంత చెరుకు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈనెల 26న ఫ్యాక్టరీకి పెద్ద ఎత్తున తరలివచ్చి తమ అభిప్రాయం చెప్పేందుకు చెరుకు రైతులు సిద్ధమవుతున్నారు. రైతులకు గిట్టుబాటు ధర చెల్లింపు, చెరుకు క్రషింగ్ బకాయిల చెల్లింపు, హార్వెస్టింగ్ తదితర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, కర్మాగారాన్ని ప్రభుత్వ ఆధీనంలో నడిపించినా.. ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించినా.. భవిష్యత్తులో ఫ్యాక్టరీని తరలించడంగానీ.. మూసివేయడంగానీ చేయొద్దని డిమాండ్ చేయనున్నారు.

న్యూస్‌రీల్

టీబీ వ్యాధిగ్రస్తులకు చేయూతనిద్దాం



మహిళకు పౌష్టికాహారం అందిస్తున్న డీఎంహెచ్‌వో

కోరుట్లటౌన్: టీబీ వ్యాధిగ్రస్తులకు చేయూత ఇవ్వాలని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ అన్నారు. కోరుట్ల ఏరియా ఆసుపత్రిలో స్వస్త్ నారి శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులకు మంగళవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. దాతలు, ప్రజాప్రతినిధులు, సామాజిక సేవా సంస్థలు ముందుకొచ్చి క్షయ రోగులను ఆదుకోవాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ మాట్లాడుతూ క్షయ రోగులను మానవతా దృక్పథంతో ఆదుకోవాలన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఆకుల శ్రీనివాస్, ఐఎంఏ డాక్టర్లు వై.అనూప్‌రావు, రేగొండ రాజేశ్, వినోద్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



వరదనీటితో నిండుగా ఎస్సారెస్పీ

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో 40 గేట్లు ఎత్తి, 2,84,866 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి 2.22 లక్షల క్యూసెక్కుల నీరు వస్తోంది. వరద కాలువకు 6,735 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 5,500, ఎస్కేప్ గేట్ల ద్వారా 2,500, సరస్వతి కెనాల్‌కు 400, లక్ష్మి కెనాల్‌కు 200, అలీసాగర్ ఎత్తి పోతల పథకానికి 180, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

'ఒకే దేశం ఒకే పన్ను' అమలు చేయాలి



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: జీఎస్టీ తెచ్చిన మోదీ ప్రభుత్వం తన తప్పును గ్రహించి సరళీకృతం చేయడాన్ని ఆహ్వానిస్తున్నామని మాజీమంత్రి జీవన్ రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఇందిరాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. పన్ను మినహాయింపు ఇచ్చామంటే ఇప్పటివరకు పన్నుల భారం మోపామని కేంద్రం ఒప్పుకున్నట్లేనన్నారు. ప్రజాభిప్రాయం మేరకు ప్రధాని మోదీ పెట్రోల్, డీజిల్‌పై ఒకేదేశం ఒకే పన్ను విధానం అమలు చేయాలని, 18 శాతం జీఎస్టీ పరిధిలోకి తేవాలన్నారు. జీఎస్టీ పన్నుల సరళీకరణతో కలిగే లబ్ధిని వినియోగదారులకు చేరేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. నాయకులు బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, పుప్పాల అశోక్, జున్ను రాజేందర్, రఘువీర్ గౌడ్, గుండ మధు పాల్గొన్నారు.

అంతరాయం రాకుండా అదనపు బ్రేకర్లు

- ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సుదర్శన్



వేములకుర్తి సబ్‌స్టేషన్‌లో బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న సుదర్శన్

ఇబ్రహీంపట్నం/మల్లాపూర్: నాణ్యమైన విద్యుత్ సరఫరాలో అంతరాయం రాకుండా అదనపు బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సుదర్శన్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్, వేములకుర్తి, మల్లాపూర్ సబ్‌స్టేషన్‌లో బ్రేకర్లు, ఇంటర్ లింకింగ్‌ను ప్రారంభించారు. రూ.20 లక్షలతో రెండు బ్రేకర్లను ఏర్పాటు చేశామన్నారు. అన్ని సబ్‌స్టేషన్లకు రెండో ప్రత్యామ్నాయ లైన్లు వేస్తున్నామని, 70 శాతం పూర్తయ్యాయని తెలిపారు. రైతులు కెపాసిటర్లు బిగించుకోవాలన్నారు. మెట్‌పల్లి డివిజన్ డీఈ మధుసూదన్, ఎమ్మార్టీ డీఈ రవీందర్ పాల్గొన్నారు.

అనంత దీపోత్సవం

ధర్మపురి: దసరా నవరాత్రోత్సవాల సందర్భంగా శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధం శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి అనంత దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగనంలో ఓం, స్వస్తిక్, మహాలింగేశ్వర ఆకారాలతో విద్యుత్ దీపాలను అలంకరించారు.

మహిళా ఆరోగ్యంతోనే మంచి కుటుంబం

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



కోరుట్లలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

కోరుట్లరూరల్/కోరుట్ల: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే శక్తివంతమైన కుటుంబం తయారవుతుందని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. స్వస్త్‌నారి స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా అయిలాపూర్ పీహెచ్‌సీలో వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో ప్రమోద్‌తో కలిసి ప్రారంభించారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు.

సీఎంది బజారుభాష..

మల్లాపూర్: సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ, బహిరంగసభల్లో బజారుభాష మాట్లాడుతూ రాష్ట్రం పరువు తీస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలోనే ఎండగడదామన్నారు. పదేళ్లుగా లేని యూరియా కష్టాలు కాంగ్రెస్ పాలనలో ఎందుకొచ్చాయని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలని కోరారు. అనంతరం దుర్గాదేవి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు

మెట్‌పల్లి: సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలకు ఆర్థికంగా ప్రయోజనం కలుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. మండలంలోని 52మందికి రూ.13.98లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో అందించారు.

సూర్య ప్రభ వాహనంపై శ్రీనివాసుడు



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు

కోరుట్ల: పట్టణంలోని అతి పురాతన శ్రీవేంకటేశ్వర ఆలయం, అష్టలక్ష్మీ సహిత శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయాల్లో దసరా శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వేంకటేశ్వర ఆలయంలో సూర్యప్రభ వాహనంపై.. అష్టలక్ష్మీ ఆలయంలో హనుమత్‌వాహనంపై స్వామివారలు భక్తులకు దర్శనమిచ్చారు.

ఉత్పత్తుల మేళాకు మహిళలు



జాతీయస్థాయి ఉత్పత్తుల మేళాకు హాజరైన జిల్లా మహిళలు

జగిత్యాలజోన్: హైదరాబాద్‌లోని శిల్పారామంలో జరుగుతున్న జాతీయస్థాయి మహిళాసంఘాల ఉత్పత్తుల మేళాకు మంగళవారం జిల్లా నుంచి మహిళాసంఘాల ప్రతినిధులు తరలివెళ్లారు. వారి బస్సును డీఆర్డీఏ పీడీ రఘువరణ్ ప్రారంభించారు. అక్కడికెళ్లిన మహిళలు ఆయా రాష్ట్రాల మహిళలు తయారుచేసిన ఉత్పత్తులు, అమ్మకాలు, మార్కెటింగ్, తీసుకున్న రుణం, శిక్షణ ప్రమాణాలపై అడిగి తెలుసుకున్నారు. సెర్ప్ అధికారులు ఉత్పత్తుల ప్యాకింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ సౌకర్యంపై అవగాహన కల్పించారు. ఏపీడీ సునీత, డీపీఎం రమేశ్, జిల్లా ఏపీఎం వి.గంగాధర్, సీసీ సత్యనారాయణ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరోజన, కార్యదర్శి ఆమని పాల్గొన్నారు.

అంజన్నకు పూజలు.. బతుకమ్మ ఆటలు



కొండగట్టులో పూజలు చేస్తున్న డిప్యూటీ మాజీ స్పీకర్, మాజీ విప్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్



జిల్లాకేంద్రంలో బతుకమ్మ సంబరాల్లో..

మల్యాల/జగిత్యాల టౌన్: బీఆర్ఎస్ మహిళా నాయకులు కొండగట్టు అంజన్నకు ప్రత్యేక పూజలు చేశారు. వీరిలో డిప్యూటీ మాజీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ విప్ గొంగిడి సునీత, ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, కొడిమ్యాల మాజీ జెడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి ఉన్నారు. వీరికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం జిల్లాకేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, బీఆర్ఎస్ మల్యాల అధ్యక్షుడు జనగం శ్రీనివాస్, మిట్టపల్లి దశరథం, అరుణ్, మల్లేశం గౌడ్, విద్యాసాగర్‌రావు ఉన్నారు.



బ్రహ్మచారిణి రూపంలో అమ్మవారు

ధర్మపురి: శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారు మంగళవారం పసుపురంగు వస్త్రంలో బ్రహ్మచారిణి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధం శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని న్యూ టీటీడీ కల్యాణ మండపంలో నవదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గాయత్రీదేవిగా అమ్మవారు

మల్యాల: కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలో దుర్గాదేవి నవరాత్రోత్సవాల సందడి నెలకొంది. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అమ్మవారు గాయత్రిదేవి రూపంలో దర్శనం ఇచ్చారు. లంబాడిపల్లిలో శ్రీపద్మసహిత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని గాయత్రిదేవిగా అలంకరించారు.

'డిజిటల్ అరెస్ట్'.. సైబర్ మోసం

- ఎస్పీ అశోక్‌కుమార్



ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: డిజిటల్ అరెస్ట్ అనేది సైబర్ మోసమని, దానిని ఎవరూ నమ్మవద్దని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు తాము పోలీస్ అధికారులమని, సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఇతర ప్రభుత్వ విభాగాల సిబ్బంది అంటూ నటిస్తూ.. కేసు ఉందని భయపెట్టడం, వీడియో కాల్‌లో అరెస్ట్ చేస్తున్నామని చూపించడం, డబ్బులు బదిలీ చేస్తే తప్పించుకోవడం డిజిటల్ అరెస్ట్ అని తెలిపారు. ఇలాంటి నేరాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. మోసపోతే వెంటనే 1930కు కాల్ చేయాలని, తద్వారా డబ్బు రికవరీ అయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఆలస్యం చేస్తే నష్టపోతారని హెచ్చరించారు.

డిజిటల్ అరెస్ట్ మోసాలపై ప్రజలకు సూచనలు

- ప్రభుత్వ శాఖలు లేదా పోలీసులు డబ్బులు అడగరు
- కేసులు ఉన్నాయన్న కారణంగా ఎవరైనా వీడియో కాల్ ద్వారా బెదిరిస్తే నమ్మకండి
- వెంటనే 1930 నంబర్ (సైబర్ క్రైం హెల్ప్ లైన్) లేదా డయల్ 100కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి.
- మోసపూరిత కాల్స్, మెసేజెస్, వాట్సాప్ వీడియో కాల్స్‌కు స్పందించవద్దు
- ఈ రకమైన నేరాల నుంచి రక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ సైబర్ సేఫ్టీపై అవగాహన పెంచుకోవాలి.

తూటాల దిశ మారిందా?

- ఎలగందల్ ఫైరింగ్ రేంజ్ నుంచి బోనాలపల్లె మీదకు బుల్లెట్లు
- టార్గెట్‌ని తాకి దిశ తప్పి గ్రామం వైపు తూటాల ప్రయాణం
- అమృతమ్మను తాకింది ఎస్ఎల్ఆర్ తూటాగా నిర్ధారణ
- ఫైరింగ్ రేంజ్‌లో వెంటనే చర్యలు చేపట్టాలని గ్రామస్తుల డిమాండ్
- బాలిస్టిక్ ఎక్స్‌పర్ట్‌లు వస్తేనే వాస్తవాలు వెలుగులోకి

సాక్షిప్రతినిధి,కరీంనగర్: తుపాకీ నుంచి తూటా బయటికి వచ్చిన తరువాత.. టార్గెట్ వైపునకు దూసుకుపోతుంది. టార్గెట్‌ను తాకిన తరువాత దాని వేగం ఆగదు. కానీ, దిశ మార్చుకుని అదే వేగంతో మరింత ముందుకు దూసుకుపోతుంది. ఎలగందుల ఫైరింగ్ రేంజ్ సమీపంలో ఉన్న బోనాలపల్లె వైపునకు దూసుకుపోతున్న పోలీసు తూటాల విషయంలో సరిగ్గా ఇదే జరిగిందని పోలీసు అధికారులు భావిస్తున్నారు. తూటా ప్రయాణంలో ఉండగా.. దిశ మార్చుకోవడం సహజంగా జరిగేదే అని అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలోనే బోనాలపల్లెలోని వృద్ధురాలు అమృతమ్మకు తగిలిన తూటా, అంతకుముందు అక్కడి ఇళ్ల పైకప్పుల నుంచి లోనకు దూసుకువచ్చిన బుల్లెట్లు కూడా ఇదే విధంగా వచ్చి ఉంటాయని అంచనా వేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. బోనాలపల్లెలో అమృతమ్మను తాకింది ఎస్ఎల్ఆర్ నుంచి వచ్చినట్లుగా పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది.



బుల్లెట్ రికోషే

బుల్లెట్‌ను తుపాకీ నుంచి పేల్చిన తరువాత లక్ష్యం వైపు దూసుకుపోతుంది. టార్గెట్ మనిషి లేదా జంతువు ఇంకేదైనా మెత్తని ఉపరితలం అయితే.. దాన్ని చీల్చుకుంటూ వెళ్తుంది. లక్ష్యానికి కలిగే నష్టం బుల్లెట్ ప్రయాణించిన దూరం మీద ఆధారపడి ఉంటుంది. నునుపు లేదా గరుకు ఉపరితలాలను సమీపం నుంచి బుల్లెట్ తాకినపుడు అది తాకిన కోణం ఆధారంగా దిశ తప్పకుండా మార్చుకుని మరో దిశకు దూసుకుపోతుంది. దీన్నే సాంకేతిక భాషలో 'బుల్లెట్ రికోషే' అని పిలుస్తారు. ఉదాహరణకు తుపాకీ నుంచి వెలువడిన ఒక బుల్లెట్ 15 నుంచి 45 డిగ్రీల కోణంలో ఉపరితలాన్ని తాకినప్పుడు అది తన దిశను మార్చుకునేందుకు అధిక అవకాశాలు ఉన్నాయని సీనియర్ పోలీసులు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో 70 నుంచి 90 డిగ్రీల కోణంలో గరుకు ఉపరితలాన్ని బుల్లెట్ తాకినప్పుడు అది తిరిగి వచ్చి కాల్చిన వ్యక్తి శరీరంలోకే దూసుకు వెళ్లే ప్రమాదముందని స్పష్టంచేస్తున్నారు.

బోనాలపల్లెలో ఏం జరుగుతోంది?

బోనాలపల్లె వైపునకు బుల్లెట్లు దూసుకువస్తున్న విధానంపై స్థానిక పోలీసులు ఇప్పటికే ఒక అంచనాకు వచ్చినట్లు సమాచారం. శిక్షణలో ఉన్న పోలీసులకు ఉన్నతాధికారులు పాయింట్22, 303, సెల్ఫ్ లోడెడ్ రైఫిల్ (ఎస్ఎల్ఆర్), ఏకే–47, పిస్టల్, కార్బన్ తదితర అన్ని రకాల తుపాకులతో సాధన చేయిస్తారు. ఏ తుపాకీ నుంచి వెలువడిన బుల్లెట్ అయినా సగటున గంటకు 43,00 కిమీలకుపైగా వేగంతో ప్రయాణిస్తుంది. ఎలగందుల ఫైరింగ్‌రేంజ్‌లో టార్గెట్ బోర్డులను తాకి వెనక ఉన్న కొండ రాళ్లను తాకుతున్నాయి. కాల్చిన తూటాల్లో చాలామట్టుకు అక్కడే ఆగిపోతాయి. కొన్ని తూటాలు రాళ్ల ఉపరితలం అంచును తాకి దిశను మార్చుకుని బోనాలపల్లె వైపుకు దూసుకొస్తున్నాయి. గతంలోనూ ఇలా తూటాలు దూసుకువచ్చాయి. కానీ, ఆ సమయంలో మైనింగ్ లేకపోవడంతో గుట్టు ఎత్తు అధికంగా ఉండేది. దీంతో అక్కడే ఆగిపోయేవి. ఈ మధ్య ఎత్తు తగ్గడంతో బోనాలపల్లె వరకు బుల్లెట్లు ప్రయాణిస్తున్నాయి. ఇలా దిశ మార్చుకున్న తూటాలు కూడా ప్రాణాంతకమే అని పలువురు పోలీసు అధికారులు అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్ నుంచి బాలిస్టిక్ ఎక్స్‌పర్ట్స్ టీం వచ్చి అధ్యయనం చేసిన అనంతరం మరిన్ని విషయాలు తెలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

వ్యవసాయ బావిలో గుర్తుతెలియని మృతదేహం



వ్యవసాయ బావిలో మృతదేహం

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం మోతె శివారు నవదుర్గ ఆలయ సమీపంలో ఓ వ్యవసాయ బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. సుమారు 35 నుంచి 40 ఏళ్ల వ్యక్తిగా అనుమానిస్తున్నామని, కుడిచేతిపై ఎస్.హన్మంతరావు అని రాసి ఉందని, గోధుమరంగు నిండుచొక్కా, నెవీబ్లూ కలర్ ప్యాంట్ ఉందని, గుర్తించిన వారు రూరల్ ఎస్సై సదాకర్‌ను సంప్రదించాలని కోరారు.

కట్నం వేధింపులు.. భర్తకు జైలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌కు చెందిన కూర నిర్మలను కులంపేరుతో దూషించడంతోపాటు కట్నం కోసం వేధించడంతో భర్త అంజిరెడ్డికి మంగళవారం కోర్టు ఏడాది జైలు శిక్ష విధించినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. నగునూరుకు చెందిన నిర్మలను వివాహం చేసుకున్న అంజిరెడ్డి రూ.5లక్షల కట్నం తీసుకురావాలని వేధించడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారణ చేసిన కోర్టు అంజిరెడ్డికి ఏడాది జైలు శిక్షతోపాటు రూ.1000 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

భూమి కోసమే రమేశ్ హత్య

- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి


వేములవాడ: భూమి కోసమే సిరిగిరి రమేశ్ హత్యకు గురైనట్లు ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి అన్నారు. మంగళవారం వివరాలు వెల్లడించారు. చందుర్తిలోని భూమిని ఎస్సీ కార్పొరేషన్ లోన్‌పై పెట్రోల్ బంక్ కోసం చిర్రం రవి, సిరిగిరి రమేశ్‌కు రిజిస్ట్రేషన్ చేశారని, అయితే పెట్రోల్ బంక్ ఇవ్వకుండా, తిరిగి భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా సదరు భూమి తనదే నంటూ రమేశ్ అమ్మకానికి ప్రయత్నాలు మొదలు పెట్టడంతో విషయం తెలుసుకున్న రవి ఆ భూమి తనకు దక్కాలంటే రమేశ్‌ను అంతం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకు ఎద్దండి వెంకటేశ్, అలా వంశీకి సుపారీ ఇచ్చాడు. పథకం ప్రకారం ఈనెల 19న రాత్రి 8 గంటలకు పెద్దూరు సబ్‌స్టేషన్ సమీపంలో కారు ఆపి, కారులో నిద్రిస్తున్న రమేశ్‌ను వంశీ, చిర్రం రవి కదలకుండా గట్టిగా పట్టుకోగా, వెంకటేశ్ కత్తితో రమేశ్ గొంతు, ఛాతిపై పొడిచి హత్య చేశాడు. అనంతరం కారుతోపాటు మృతదేహాన్ని వేములవాడ నందికమాన్ సమీపంలోని రమేశ్‌కు చెందిన నందీశ్వర టౌన్‌షిప్ వెంచర్‌లో వదిలి పారిపోయారు. ఈక్రమంలో వేములవాడ శివారులోని సాయిరక్షా దాబా సమీపంలో ఎద్దండి వెంకటేశ్, అలా వంశీని పట్టుకుని, వారి నుంచి కారు, మొబైల్‌ఫోన్, హత్యకు ఉపయోగించిన కత్తిని సీజ్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ వివరించారు. చిర్రం రవి పరారీలో ఉన్నాడని తెలిపారు.

మహిళలపై బండరాళ్లు విసిరిన వ్యక్తిపై కేసు

కొత్తపల్లి: చింతకుంట శాంతినగర్‌లో ఈనెల 21న బతుకమ్మ ఆడుతున్న మహిళలపై బండరాళ్లతో దాడిచేసిన వ్యక్తిని రిమాండ్ చేశామని సీఐ కోటేశ్వర్ తెలిపారు. ప్రైమరీస్కూల్ ప్రాంతానికి చెందిన షేక్‌సజ్జు బండరాళ్లతో అక్కడే బతుకమ్మ ఆడుతున్న కాసారపు లక్ష్మి, మధురెడ్డి, ఎల్లమ్మ, మొగిలి అకిరానంద్‌పై దాడిచేయగా గాయాలయ్యాయి. కాసారపు లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, షేక్‌సజ్జును మంగళవారం అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు. చట్ట వ్యతిరేకంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

గంజాయి రవాణాపై నిఘా

- రాజన్న సిరిసిల్ల ఎస్పీ మహేశ్ బీ గితే
- 14.945 కిలోల గంజాయి దహనం



గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్ బీ గితే

సిరిసిల్లక్రైం: రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా వివిధ పోలీసుస్టేషన్‌లలో నమోదైన 45 కేసుల్లో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న 14.945 కిలోల గంజాయిని చట్ట ప్రకారం జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటిస్తూ దహనం చేసినట్లు ఎస్పీ మహేశ్ బీ గితే తెలిపారు. మనకొండూరులోని బయోలాజికల్ ల్యాబ్‌లో గంజాయిని దహనం చేసినట్లు వివరించారు. గంజాయి రవాణా చేసినా, అమ్మినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి రవాణాపై నిరంతరం నిఘా పెడుతూ నార్కోటిక్ జాగిలాలతో విస్తృత తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, డీసీఆర్బీ సీఐ నాగేశ్వరరావు, ఆర్ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

'కడారి'.. ఉద్యమమే ఊపిరి

- పోరుబాటలో అసువులు బాసిన సత్యనారాయణరెడ్డి
- గోపాల్‌రావుపల్లె నుంచి ఛత్తీస్‌గఢ్ వరకు
- 45 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం



సత్యనారాయణరెడ్డి గ్రామం గోపాల్‌రావుపల్లె

సిరిసిల్ల/తంగళ్లపల్లి(సిరిసిల్ల): మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోస అలియాస్ సాధు ఉద్యమమే ఊపిరిగా జీవితాన్ని ప్రజలకోసమే పణంగా పెట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లెకు చెందిన కడారి కిష్టారెడ్డి–అన్నమ్మ చిన్న కొడుకు సత్యనారాయణరెడ్డి. 1980లో ఉద్యోగాన్ని వదిలి ఉద్యమబాటలో సాగిన ఆయన ఇంటివైపు కన్నెత్తి చూడకుండా నాలుగున్నర దశాబ్దాలపాటు మావోయిస్టు ఉద్యమంలో కీలక నేతగా ఉన్నారు.

గోపాల్‌రావుపల్లె నుంచి ఛత్తీస్‌ఘడ్ వరకు..

సత్యనారాయణరెడ్డి తండ్రి ఉపాధ్యాయుడు కావడంతో ఆయన పనిచేసిన ఎల్లారెడ్డిపేటలోనే చదువు సాగింది. ఆటలు, చదువులో చురుకుగా ఉండేవాడు. పెద్దపల్లి జిల్లాలో చదువు పూర్తి కావడంతో ఉద్యోగం సాధించిన సత్యనారాయణరెడ్డి అక్కడ జరిగిన కార్మిక సంఘాల గొడవల్లో జైలుపాలు కావడంతో వామపక్ష ఉద్యమాలవైపు వెళ్లాల్సి వచ్చింది. మహారాష్ట్రలోని సిరోంచా, గడ్చిరోలీ ప్రాంతాల్లో ఆర్గనైజర్‌గా అప్పటి పీపుల్స్‌వార్ దళనాయకుడిగా, జిల్లా కమిటీ సభ్యుడిగా, జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగారు. దేశవ్యాప్తంగా మావోయిస్టు పొలిట్ బ్యూరోలో 26 మంది సభ్యులు ఉండగా వారిలో ఒకరిగా కోస ఉన్నారు. పెళ్లి చేసుకోకుండా వ్యక్తిగత జీవితాన్ని సైతం ప్రజలకోసం త్యాగం చేసినట్లు ఆయన సన్నిహితులు చెబుతారు. అనారోగ్యంతో ఉన్నా కూడా అడవిబాట విడవకుండా దండకారణ్యంలో ప్రజాయుద్ధాన్ని కొనసాగించారు.

ఛత్తీస్‌గఢ్ బయల్దేరిన కుటుంబ సభ్యులు

నారాయణపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన సత్యనారాయణరెడ్డి మృతదేహం కోసం అతడి సోదరుడు కరుణాకర్‌రెడ్డి, సమీప బంధువులు మంగళవారం ఛత్తీస్‌గఢ్‌కు బయలుదేరారు. పోస్టుమార్టం అనంతరం కోస మృతదేహాన్ని స్వగ్రామం గోపాల్‌రావుపల్లెకు తీసుకువచ్చే అవకాశం ఉంది.

'కోస'తో ఎల్లారెడ్డిపేటకు అనుబంధం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారాయణరెడ్డి(కోస)కి ఎల్లారెడ్డిపేట మండలంతో విడదీయరాని అనుబంధం ఉంది. సత్యనారాయణరెడ్డి తండ్రి కడారి కిష్టారెడ్డి గణిత ఉపాధ్యాయుడిగా మండల కేంద్రంలోని పెద్దబడిలో 1976 వరకు పనిచేశారు. ఆ సమయంలో చిన్నవయసులో ఉన్న సత్యనారాయణరెడ్డి ఇక్కడే చదువుకున్నారు. ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు పెద్దబడిలో చదువుకున్నారు. నారాయణపూర్‌లో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో సత్యనారాయణరెడ్డి చనిపోయాడన్న వార్త ఎల్లారెడ్డిపేటలో కలకలం రేపింది. ఆ సమయంలో పెద్దబడిలో చదువుకున్న విద్యార్థులు కోసతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటున్నారు. వారిని కదిలించగా.. విద్యార్థి వయసు నుంచే సోషలిస్ట్ భావాలు ఉండేవని, సమాజంలోని అన్యాయాలపై ప్రశ్నించేవారని గుర్తుచేసుకున్నారు. ఎప్పుడూ సమసమాజం, పేదల బతుకులపై మాట్లాడేవారని తెలిపారు. తమతో చదువుకున్న విద్యార్థి కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగి, ఎన్‌కౌంటర్‌లో చనిపోవడంపై వారు భావోద్వేగానికి గురయ్యారు.

స్నేహితుడు దూరమయ్యాడు



50 ఏళ్లకు ముందు చిన్ననాడు కలిసి ఆడుకున్నాం. 45 ఏళ్లుగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఒక్కసారి కూడా చూసింది లేదు. ఇప్పుడు ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్లు తెలిసింది. బాల్యం నుంచి 10వ తరగతి వరకు ఎల్లారెడ్డిపేట, ఐటీఐ పెద్దపెల్లిలో చదివాడు.

– కల్లెపల్లి భూంరెడ్డి, కోస చిన్ననాటి స్నేహితుడు, గోపాల్‌రావుపల్లె

మృతదేహాన్ని గ్రామానికి తీసుకురావాలి



కడారి సత్యనారాయణ ఉరఫ్ కోస మా గ్రామస్తుడే. ఆయన నాకంటే ఎనిమిదేళ్లు పెద్దవాడు. సోమవారం రాత్రి ఆయన ఎన్‌కౌంటర్ అయినట్లు ఫోన్‌లలో వచ్చింది. ఫొటో చూసి అతనే అని గుర్తుపట్టాను. మా ఇద్దరికి చిన్నతనంలో 12 ఏళ్ల అనుబంధం ఉంది. కోస మృతదేహాన్ని గ్రామానికి తీసుకువస్తే ఇక్కడే దహన సంస్కారాలు చేస్తాం.

– ఆలూరి కరుణాకర్‌రెడ్డి, గోపాల్‌రావుపల్లె (23ఎస్ఆర్ఎల్279)

అప్పుడు చిన్న పిల్లాడిని



నా వయసు ప్రస్తుతం 50 సంవత్సరాలు. నేను చిన్నపిల్లాడిగా ఉన్నప్పుడు కోస అజ్ఞాతంలోకి వెళ్లాడు అని పెద్దలు చెబుతారు. ఆయన్ను ఒక్కసారి కూడా చూడలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన మృతదేహాన్ని గ్రామానికి అప్పగిస్తే అంత్యక్రియలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాము.

– ఎసిరెడ్డి రాంరెడ్డి, మాజీ సర్పంచ్, గోపాల్‌రావుపల్లె

మాతో కలిసి ఉగాదికి ఉన్నాడు



కరీంనగర్‌లో ఇంటర్ పూర్తిచేసి పెద్దపెల్లిలో ఐటీఐ చేశాడు. అంతకంటే ముందు పదో తరగతి వరకు ఎల్లారెడ్డిపేటలో చదువుకున్నాడు. మా ఊరిలో 1980 ఏప్రిల్‌లో ఉగాదికి ఇద్దరం ఉండి అమ్మనాన్నతో కలిసి పండుగ జరుపుకున్నాం. ఆ తరువాత ఉద్యోగం రావడంతో కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్లాడు. అటు నుంచి అటే ప్రజా ఉద్యమాల్లోకి వెళ్లినట్లు మాకు తర్వాత తెలిసింది.

– కడారి కరుణాకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి అన్న

యాదాద్రి జిల్లాలో గొర్రెల చోరీ

- మొలంగూర్‌లో పట్టివేత



మొలంగూర్‌లో పట్టుకున్న గొర్రెలు

శంకరపట్నం: యాదాద్రి భువనగిరి జిల్లాలో చోరీకి గురైన గొర్రెలను మంగళవారం వేకువజామున మొలంగూరులో పోలీసులు పట్టుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో పదిరోజుల క్రితం 10 గొర్రెలు చోరీకి గురయ్యాయి. అక్కడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. విచారణలో భాగంగా చోరీకి గురైన గొర్రెలు శంకరపట్నం మండలం మొలంగూర్ శివారులోని మైదానం ప్రాంతంలో ఉన్నట్లు తెలుసుకున్నారు. అక్కడి పోలీసులు, స్థానిక పోలీసుల సాయంతో ట్రాలీఆటోలో గొర్రెలను తీసుకెళ్లారు. గొర్రెల దొంగలు మండలానికి చెందిన వ్యక్తులుగా ప్రచారం జరుగుతోంది.

నవోదయ ప్రవేశానికి గడువు పెంపు

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయంలో తొమ్మిది, పదకొండో తరగతిలో మిగులు సీట్ల ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ గడువు తేదీని అక్టోబర్ 7వ తేదీ వరకు పొడిగించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె. బ్రహ్మానందరెడ్డి తెలిపారు. 2026– 27 విద్యా సంవత్సరంలో ఎనిమిదోతరగతి చదివే విద్యార్థులు తొమ్మిదో తరగతిలో మిగులు సీట్లకు, పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పదకొండో తరగతిలో మిగులు సీట్లలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను నవోదయ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో పంపించవచ్చని తెలిపారు.

ఖాళీ స్థలాలు..మురికి నిలయాలు



- ఎక్కడికక్కడే దోమలకు ఆవాసాలు
- కరువైన నివారణ చర్యలు

కోరుట్ల: ప్రతీరోజు మోస్తరుగా కురుస్తున్న వర్షానికి కోరుట్ల పట్టణంలోని ఖాళీస్థలాల్లో మురికినీరు నిలిచి ప్రమాదకరంగా మారింది. నీట కుంటలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. ఖాళీ స్థలాల్లో నిలిచిన నీటిని తొలగించడంతో ఆయా స్థలాల యజమానులు, మున్సిపల్ అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో జనం ఇబ్బందుల పాలవుతున్నారు.

లెక్కలేనన్ని ఖాళీ స్థలాలు

పట్టణంలో 33 వార్డులు ఉన్నాయి. శివారు ప్రాంతాల్లోని వార్డులతోపాటు పట్టణ నడిబొడ్డున ఉన్న వార్డుల్లోనూ చాలాచోట్ల ఖాళీ స్థలాలు ఉన్నాయి. 33 వార్డుల్లో కలిపి 390వరకు ఖాళీ స్థలాలు ఉన్నట్లు అంచనా. ఏళ్ల తరబడి ఖాళీగా ఉండటం సమస్యగా మారింది. ఆయా ఖాళీ స్థలాల్లో వర్షాలకు మురికి నీరు నిండిపోతోంది. ఆ నీటిలో దోమలు పెరిగిపోతున్నాయి. ప్రతిరోజూ వర్షం కురుస్తుండడం.. నీరు మురికిగా ఉండడంతో డెంగీకారక దోమలకు ఆలవాలంగా మారుతోంది. ఫలితంగా అన్ని వార్డుల్లో డెంగీ, మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. శివారు ప్రాంతాలైన హాజీపురా, ఆనంద్‌నగర్, బిలాల్‌పురా, రాంనగర్, అంబేద్కర్ నగర్, అయిలాపూర్ రోడ్ ఏరియాల్లో జ్వర పీడితులు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఆయా ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో నిలిచిన నీటి ఫలితంగానే విష జ్వరాలు, సీజనల్ సంబంధిత వ్యాధులు విజృంభిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నివారణ చర్యలు శూన్యం

ఖాళీ స్థలాల్లో దోమలు వృద్ధికాకుండా గతంలో ఆయిల్ బాల్స్, గంబూసియా చేపలను వదిలేవారు. చేపలు, ఆయిల్ బాల్స్ నీటిలో పెరిగే దోమల లార్వాను దెబ్బతీసేవి. కానీ.. ఈ సారి కనీసం ఆయిల్ బాల్స్ కూడా వేయడం లేదు. గంబూసియా చేపల జాడే లేదు. దోమల నివారణకు ఫాగింగ్ మిషన్లు వాడుతున్న దాఖలాలు లేవు. ఫలితంగా జనాలు జ్వరాలు పాలవుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు జ్వరాలతో వస్తున్న వారి సంఖ్య పెరిగిపోవడం గమనార్హం. మున్సిపల్ అధికారులు దోమల నివారణకు చర్యలు చేపట్టి సీజనల్ వ్యాధులను అరికట్టాల్సిన అవసరముంది.

చికిత్స పొందుతూ డ్యాన్స్ మాస్టర్ మృతి



దాసరి శేఖర్ (ఫైల్)

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన డ్యాన్స్ మాస్టర్ దాసరి శేఖర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు... ఓ ప్రైవేటు పాఠశాలలో డ్యాన్స్ మాస్టర్‌గా పనిచేస్తున్న శేఖర్ మూడు రోజుల క్రితం పెద్దపల్లి జిల్లా ధర్మారం గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి అక్కడే పురుగుమందు తాగాడని, బంధువులు కరీంనగర్‌లోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడని, శేఖర్‌కు భార్య ఉందని, మృతికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

ఆయిల్ పాం తోటల్లో 'ఆఫ్రికన్' పురుగులు



పరాగ సంపర్కం కోసం పురుగుల విడుదల

- ఉద్యానశాఖ ద్వారా తోటల్లోకి..
- దిగుబడి పెంచాలనేది లక్ష్యం



జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల జిల్లాలో మూడేళ్ల క్రితం ఆయిల్ పాం సాగుకు రైతులు ముందుకొచ్చారు. ప్రస్తుతం ఆ తోటలు కాపుకొస్తున్నాయి. ఆయిల్ పాం సాగుపై రైతులకు పెదగా అవగాహన లేకపోవడంతో ఉద్యానశాఖ, కంపెనీ అధికారులు సమావేశాలు నిర్వహిస్తూ.. క్షేత్రస్థాయిలో పర్యటించి వివరించారు. రైతులు అన్ని రకాల యాజమాన్య పద్ధతులు పాటించి తోటలు సాగు చేస్తున్నారు. అయితే పూతను పిందెగా మార్చి.. దిగుబడి పెంచేందుకు మల్యాల, పెగడపల్లి, గొల్లపల్లి, ధర్మపురి మండలాల్లో సాగవుతున్న ఆయిల్ పాం తోటల్లో పరాగ సంపర్కం కోసం ఉద్యానశాఖ, లోహియా ఆయిల్ పాం కంపెనీ అధికారులు ఆఫ్రికన్ పురుగులను వదిలుతున్నారు.

పూతకొస్తున్న తోటలు

జిల్లాలో 2022–23లో సుమారు మూడు వేల ఎకరాల్లో ఆయిల్ పాం సాగు చేశారు. ఆ తోటలు పూతకు వస్తున్నాయి. పూత పిందెగా మారి, ఆపై కాయగా మారాల్సి ఉంటుంది. అప్పుడే ఆయిల్ పాం గెలలను కోసి ప్రాసెసింగ్‌కు పంపించాల్సి ఉంటుంది. తోటల్లో రసాయన ఎరువులు.. పురుగు మందుల వాడకం పెరగడంతో పరాగ సంపర్కం కోసం సహజ సిద్ధంగా వచ్చే పురుగులు రావడం లేదు. దీంతో పూత దశలో ఉన్న తోటల్లో ఆఫ్రికన్ పురుగులను వదులుతున్నారు. ఎలాడోబియస్ కామెరునికాస్ అనే ఆఫ్రికన్ పురుగు ఆయిల్ పాం తోటల్లో పరపరాగ సంపర్కం జరపడంలో కీలక పాత్ర పోషిస్తుంది. చెట్టు పూతకు వస్తే.. ఆ గెలకు ఆడ, మగ పుష్పాలు పూస్తాయి. ఆఫ్రికన్ పురుగులు మగ పుష్పాల పరాగ రేణువులను ఆడ పుష్పాలకు చేరవేస్తాయి. తద్వారా ఫలదీకరణం జరిగి కాయలు ఏర్పడతాయి. పరాగ సంపర్కం జరగడం ద్వారా ప్రతి చెట్టుకూ పిందెలు ఎక్కువగా తయారై, దిగుబడి బాగా పెరుగుతుంది.

ఆఫ్రికన్ పురుగుల ప్రాధాన్యత ఏంటంటే..?

ఆఫ్రికన్ పురుగులు 4 మిల్లీమీటర్ల పొడవుంటాయి. నల్లటి రంగులో ఉండి పరాగ సంపర్కం కలిగిస్తాయి. తొలుత ఈ పురుగులను 1980 ప్రాంతంలో మలేసియాలో ఆయిల్ పాం దిగుబడి పెంచేందుకు దిగుమతి చేసుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ కూడా ఆయిల్ పాం సాగు పెరగడంతో దిగుబడి కోసం ఆఫ్రికన్ పురుగులను తీసుకొస్తున్నారు. చెట్టుకు ఉండే మగ పుష్పాల సువాసనకు ఆఫ్రికన్ పురుగులు ఆకర్షించబడతాయి. పురుగులు వాలినప్పుడు పుప్పొడి రేణువులు వాటి శరీరానికి అంటుకుంటాయి. తర్వాత పురుగులు ఆడ పుష్పాలపై వాలినప్పుడు వాటి శరీరానికి అంటుకున్న పుప్పొడి రేణువులు పడి పరాగ సంపర్కం జరుగుతుంది. ఈ పురుగుల ద్వారా అనుకున్న స్థాయిలో పరాగ సంపర్కం జరిగితే ఆయిల్ పాం తోటల్లో గెలలు ఎక్కువగా ఏర్పడటంతోపాటు నూనె దిగుబడి పెరుగుతుంది. ఈ పురుగులు ఆయిల్ పాం తోటలకుగానీ.. మనుషులకు గాని హానికరమైనవి కావు.

ఆర్నెళ్లలో చేతికందుతుంది



ఆయిల్ పాం తోటల్లో పరాగ సంపర్కం పూర్తయిన ఆరు నెలల తర్వాత పంట చేతికందుతుంది. ఆఫ్రికన్ పురుగులు పూతను పిందె.. కాయగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రస్తుతం ఆయిల్ పాం గెల టన్నుకు రూ.19,107గా ఉంది. ప్రతినెలా ఆదాయం పొందవచ్చు.

– శ్యాంప్రసాద్, జగిత్యాల ఉద్యానశాఖాధికారి

అన్ని తోటల్లో వదులుతాం



జిల్లాలో మూడేళ్లు దాటిన అన్ని ఆయిల్ పాం తోటల్లో ఆఫ్రికన్ పురుగులు వదులుతాం. దీనివల్ల పరపరాగ సంపర్కం జరిగి పూతంతా పిందెగా.. తర్వాత కాయగా మారుతుంది. రైతులకు దిగుబడి పెరిగి ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉంది. పురుగులను ప్రత్యేకంగా జిల్లాకు తెప్పించాం.

– విజయ్‌భరత్, లోహియా కంపెనీ ప్రతినిధి

పట్టపగలే చోరీ



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఇల్లందకుంట: ఇంటి యజమాని ఆరుబయట ఉండగానే గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన మంగళవారం మండలంలోని మల్యాల గ్రామ పంచాయతీ పరిధి గాంధీనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గూడెపు మల్లమ్మ ఇంటి ఆరుబయట పడుకొని ఉండగా పక్కన ఉన్న రూం కిటికీలు తెరిచి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూసింది. బీరువా తలుపులు తెరిచి ఉన్నాయని, అందులోని రూ.2.5 లక్షలు దొంగిలించారని మల్లమ్మ ఫిర్యాదు చేసిందని, సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టామని సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై క్రాంతికుమార్ వివరించారు.

వేతనాల కోసం ఎదురుచూపు

- రెండు నెలలుగా అందని జీతాలు
- పండుగకు పస్తులేనా..?



చెత్త తొలగిస్తున్న పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు

పెగడపల్లి: గ్రామ పంచాయతీల్లో వివిధ కేటగిరిలో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమకు రెండు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో అప్పు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దసరా పండుగ సమీపిస్తున్నా వేతనాలు ఇవ్వకపోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. పండుగపూట పస్తులుండాల్సిన పరిస్థితి దాపురించిందంటున్నారు. గ్రామాల్లో వీధులు, మురికి కాల్వలు శుభ్రం చేయడం, వీధి దీపాలు వేయడం, మంచినీటి సరఫరా చేయడం వీరి విధి. జిల్లాలోని 20 మండలాల పరిధిలోని 385 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో రూ.9,500 వేతనంపై 1487 మంది పనిచేస్తున్నారు. వీరిలో కారోబార్లు, ట్రాక్టర్ డ్రైవర్లు, పంపు ఆపరేటర్లు, వాటర్‌సప్లై పారిశుద్ధ్య కార్మికులున్నారు. వీరికి ప్రతినెలా ఒకటిన జీతభత్యాలు చెల్లించాల్సి ఉంది. వచ్చిన వేతనంతో కుటుంబపోషణ, ఇతర అవసరాలు తీర్చుకునే వారు. అయితే ప్రభుత్వం రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. సర్కారు స్పందించి వేతనాలు అందించాలని పంచాయతీ సిబ్బంది వేడుకుంటున్నారు.

కుటుంబం గడవడం కష్టంగా ఉంది



జీతాలు రాకపోవడంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. కూటికి లేకనే చాలీచాలని జీతం ఇస్తున్నా.. నెట్టుకొస్తున్నాం. మూడు నెలలుగా జీతం ఇవ్వకపోతే ఎట్ల బతుకుడు..?

– చంద్రయ్య మల్టీపర్పస్ వర్కర్

అప్పు చేయాల్సి వస్తుంది



పండుగ పూట పైసలు లేక ఇబ్బంది పడుతున్నాం. కనీసం పండుగకైనా జీతాలు చెల్లిస్తే సంతోషంగా జరుపుకొనే అవకాశం ఉంటుంది. ప్రతినెలా ఇదే తంతు కొనసాగుతుండడంతో అప్పు చేస్తున్నాం.

– అవునూటి రవి, ఎలక్ట్రీషియన్, బతికపల్లి

నిధులు రావాల్సి ఉంది



పంచాయతీ సిబ్బంది వేతనాలను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. పంచాయతీల ఖాతాల్లో నిధులు లేక వేతనాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. సిబ్బంది వేతన విషయం ప్రభుత్వ దృష్టిలో ఉంది.

– మదన్‌మోహన్, డీపీవో

ఆర్టీసీలో దసరా లక్కీడ్రా

విద్యానగర్(కరీంనగర్): దసరా పండుగ సందర్భంగా ఈనెల 27 నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు ఆర్టీసీ సెమీ డీలక్స్, డీలక్స్, మెట్రో డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరీ బస్సులతో పాటు అన్ని ఏసీ బస్సుల్లో ప్రయాణం చేసినవారికి లక్కీ డ్రా స్కీం అమలు చేస్తున్నట్లు కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు తెలిపారు. ఈ స్కీంకు సంబంధించి అన్ని ప్రధాన బస్‌స్టేషన్లలో లక్కీ డ్రా బాక్సులు ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికులు తమ ప్రయాణం ముగిసిన తరువాత టికెట్ వెనుక భాగంలో పేరు, చిరునామా, మొబైల్ నంబర్ రాసి బాక్స్‌లో వేయాలని సూచించారు. అక్టోబర్ 8వ తేదీ సాయంత్రం 4గంటలకు లక్కీ డ్రా తీస్తామని, మొదటి విజేతకు రూ.25వేలు, రెండో విజేతకు రూ.15 వేలు, మూడో విజేతకు రూ.10వేలు చెక్కురూపంలో అందిస్తామని వివరించారు.